
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

3★★

శనివారం 8 మార్చి 2025





ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, హాజరైన అధికారులు

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం మేరకు ఎల్ఆర్ఎస్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకుంటే 25 శాతం తగ్గింపు వర్తిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

ఈనెల 31వ తేదీ వరకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీపీవో మదన్‌మోహన్, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్, మండల పరిషత్, ఎంపీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో వంద శాతం ప్రసవాలు చేయాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో లక్ష్యం మేరకు వంద శాతం ప్రసవాలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జన ఔషధి దినోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించాలన్నారు. డెలివరీకి సిద్ధంగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల మౌలిక సేవలు ఉన్నాయన్న అంశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న వేసవి కాలం నేపథ్యంలో అన్ని సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్ ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, పలువురు వైద్యులు, ఆశా కారకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దూకుడు పెంచిన ఏసీబీ



- అవినీతి అధికారులే టార్గెట్
- మూడు నెలల్లో ముగ్గురు అధికారుల అరెస్టు... మరో ఇద్దరు మధ్యవర్తులు
- కలకలం రేపుతున్న వరుస దాడులు



ధర్మపురిలో ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్(ఫైల్)

● అధికారుల్లో ఆందోళన..

జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అవినీతి అధికారులను టార్గెట్ చేస్తూ ఏసీబీ నిఘా పెంచడంతో అధికారుల్లో ఆందోళన కలుగుతోంది. ఏసీబీ అధికారుల వరుసదాడులు జరుగుతున్నట్లు ప్రచారం నెలకొనడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీబీ అధికారుల దాడులతో ఒక్కసారిగా ఉలిక్కి పడుతున్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖ, రవాణా శాఖల్లో ఏసీబీ సోదాలు జరగడం, ముగ్గురు అధికారులు పట్టుబడ్డారు. దీంతో మిగితా శాఖ ఉద్యోగులు అప్రమత్తమయ్యారు.



కోరుట్లలో ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ శంకరయ్య(ఫైల్)



అధికారులు పట్టుకున్న మెట్‌పల్లి ఏసీబీ సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫోద్దిన్ (ఫైల్)

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం రేపుతున్నాయి. చిరుద్యోగులే కాదు పెద్దస్థాయిలో ఉన్న అధికారులను సైతం వదలనంటోంది ఏసీబీ. ఉన్నతాధికారి అయినా...సామాన్య ఉద్యోగి అయినా అవినీతికి పాల్పడితే అంతే సంగతులంటూ చేతల్లో చూపిస్తోంది. అవినీతి అధికారుల విషయంలో ఏసీబీ దూకుడుతో సరికొత్త గుబులు స్టార్ట్ అయింది. మూడు నెలల్లో ముగ్గురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. వరుస ఘటనలతో జిల్లా అధికారుల్లో కలవరం మొదలైంది.

● మధ్యవర్తులను సైతం...

ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులు అవినీతికి పాల్పడుతున్న వారిని పట్టుకునే విషయంలో దూకుడు పెంచినట్టుగా స్పష్టం అవుతోంది. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకుంటున్న ఘటనలు కూడా వదిలిపెట్టడం లేదు. మధ్యవర్తిత్వం చేసిన వారికి బాధితులకు ఎలాంటి సంబంధాలు లేకపోవడంతో పాటు అవినీతికి పాల్పడే అధికార యంత్రాంగం ఎంచుకున్న సరికొత్త మార్గాన్ని కూడా ట్రేస్ చేస్తున్నారు. దీంతో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వారు కూడా ఏసీబీ కేసుల్లో ఇరుక్కోక తప్పడం లేదు. అధికారులకు వంతపాడేం దుకు ప్రయత్నిస్తే ప్రైవేటు వ్యక్తులు అయినా సరే చట్టాలకు పనిచెప్పి తీరుతామని అంటు న్నారు ఏసీబీ అధికారులు. ఈ యేడాది జనవరి లో మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన సమయంలో ప్రైవేటు వ్యక్తి అయిన డాక్యుమెంట్ రైటర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. గతంలో మధ్యవ ర్తులు డబ్బులు తీసుకుంటే వారిని అరెస్టు చేసే విధానాన్ని అవలంబించకపోయేవారు. కొంత కాలంగా వీరిని కూడా పట్టుకుంటుండడంతో అధికార యంత్రాంగం ఎంచుకున్న అవినీతి దారులను మూసివేసే ప్రయత్నం ఏసీబీ చేస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

● గులాబీ రంగు ద్రావణం సీసాలు కీలకం..

ప్రభుత్వ శాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు, సిబ్బంది ప్రజల నుంచి లంచాలను తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాల్లో గులాబీ రంగు ద్రావణం ఉండే సీసాలను మీడియాకు చూపిస్తుంటారు. లంచగొండి ఉద్యోగులను పట్టుకున్నాక వారు తీసుకున్న కరెన్సీ నోట్లతో పాటు పింక్ రంగులో...

మిగతా 6లో

బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వ విప్ ‘అడ్లూరి’కి ఆహ్వానం

ధర్మపురి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మార్చి 10 నుంచి 22 వరకు జరిగే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శుక్రవారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆహ్వానించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, సతీసమేతంగా బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆయన వెంట వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతాపరమైన ఇబ్బందులు కలుగవద్దు: ఎస్పీ

ధర్మపురి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులకు సూచించారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం లోపల, బయట క్యూలైన్లు, స్వామి వారి నూతన కల్యాణోత్స స్థలాన్ని, బ్రహ్మపుష్కరిణి, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో కోనేరు, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు ఇతరత్రా ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలని, భద్రతా ఏర్పాట్లు గురించి అధికారులకు ఆయన తగు సూచనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఎస్పీ వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎండో మెంట్ డీఈఈ రఘునందన్, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, ఆలయ అధికారులు

పేదలకు అండగా తపాలా బీమా

కథలాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తపాలా బీమా పేదలకు అండగా ఉంటుందని పోస్టల్ శాఖ అమలు పరుస్తున్న ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ పోస్టల్ బ్యాంక్ మేనేజర్ తుర్తి రాజేశ్ సూచించారు. మండలంలోని కలికోటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మార్కం చిన్నగంగారాంనకు 10 లక్షల రూపాయల బీమా చెక్కును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 65 సంవత్సరాలు ఉన్న ఎవరైనా 520 రూపాయలు బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అంబారిపేట ఎస్‌పీ ఎం గంగరాజు, బీపీఎం సంపత్, మాజీ సర్పంచ్ వేముల నారాయణ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల: కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిదిలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ తెలిపారు. రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలోని పెద్దగుండు సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయలు ఉంటాయని తెలిపారు. పట్టణంలోని బాలాజీ రోడ్డు, రాంనగర్, బిలాలుపుర, అల్లమయ్య గుట్ట, ఎస్కోనిగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంటల నమోదు పకడ్బందీగా చేయాలి: డీఏవో



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఏవో భాస్కర్, అధికారులు

కొడిమ్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పంటల నమోదును పకడ్బందీగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పూడూర్ క్లస్టర్ పరిధిలోని నమిలికొండలో జరుగుతున్న పంటల నమోదును డీఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పంటల నమోదుతో రైతులకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. పంటల వివరాలను చెప్పటానికి వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. ఎరువుల వినియోగం, దిగుబడి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులకు వరి కోతకు వస్తుందని తెలుసుకున్నారు. మండలంలోని పూడూర్‌లోని పలువురి రైతుల వరి పొలాలను పరిశీలించి అగ్గి తెగుళ్ళ సోకిన విషయాన్ని గుర్తించి నివారణ చర్యలను రైతులకు వివరించారు. పూడూర్ సింగిల్ విండోల ఎరువుల నిల్వను, అమ్మకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు అవసరం ఉన్నంత ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, ఏఈవో రాజేష్, సింగిల్ విండో కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, అభ్యుదయ రైతులు రాంరెడ్డి, రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, లింగయ్య తదితరులు ఉన్నారు.

ధర్మపురి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

ధర్మపురి, మార్చి 7, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కందుకూరి శ్రీనివాస్ ఈ నెల 6వ తేదీన ఏసీబీ వలలో చిక్కాడు. ఆయన స్థానంలో పెగడపల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎ శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి
















సెల్‌ఫోన్ దొంగల పట్టివేత



దొంగలను తాళ్లతో కట్టేసిన స్థానికులు

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను స్థానికులు పట్టుకున్నారు. ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఓవ్యక్తి హైదరాబాద్ వెళ్ళేందుకు గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ట్రెయిన్ ఆలస్యంగా ఉండడంతో అక్కడే ఒకచోట కూర్చోగా ఇద్దరు వ్యక్తులు అనుమానంగా తిరుగుతూ కనిపించారు. కొంతసేపటి తరువాత సెల్‌ఫోన్ కనబడ లేదు. దీంతో గురువారం రాత్రంతా వెతుకగా తెల్లవారు స్థానికుల సహాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రెండు సెల్‌ఫోన్లలో ఒకటి తిరిగి ఇచ్చారు. ఇద్దరి చేతులను తాళ్ళతో కట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. కాగా, పోలీస్‌స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సతీష్, రాములుగా తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన జీవన్

తంగళ్లపల్లి (సిరిసిల్లరూరల్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న జీవన్ అనే బాలుడిపై శుక్రవారం సాయంత్రం వీధికుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పర్వతాల మహేష్, సరిత దంపతుల కుమారుడైన జీవన్ సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వచ్చి దాడి చేసి తలతో పాటుచెవులు, శరీరంపై పలుచోట్ల కరిచాయి. దీంతో బాలుడి అరుపులు విన్న గ్రామస్థులు కుక్కల గుంపును తరిమివేసి చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజలింగం అనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన ఇంటి ముందు నిలబడి ఉండగా అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండల కేంద్రంలో వారంపది రోజుల నుంచి పదిమందికి పైగా దాడిచేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పిచ్చికుక్కల రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గేదెపై చిరుత దాడి..

● ఆందోళనలో అన్నదాతలు..

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ శివారులో రైతుకు చెందిన గేదెపై చిరుతపులి దాడి చేయడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి నారాయణ రోజులాగే తన పొలం వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టివేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం వెళ్లి చూడగా గేదెపై దాడి చేసి ఉండడం, వెనుక భాగం పూర్తిగా తిని ఉండటం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా గేదెపై పులి దాడి చేసినట్లు ఉంది. ఫారెస్ట్‌అధికారి ఖలీల్ ఉద్దీన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంకా పులి అనే విషయాన్ని ఆయన నిర్ధారణ చేయలేదని, గేదెను చంపిన అనంతరం పులి అటవీప్రాంతానికి వెళ్లినట్లు అక్కడ ఉన్న మహిళలు భయపడుతున్నారు. పులి పాదాలకు సంబంధించిన ఆనవాళ్లు కనబడడంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరికి చెందిన జీల మల్లేశ్‌యాదవ్ అనే రైతుకు చెందిన లేగ దూడ శుక్రవారం హైనాదాడిలో మృతి చెందింది. వ్యవసాయ బావివద్ద రోజు వారిగానే పశువులను కట్టేసి వచ్చిన మల్లేశ్ శుక్రవారం ఉదయం బావి వద్దకు వెళ్లేసరికి లేగదూడమృతి చెందిఉంది. ఈవిషయం ఫారెస్టు, రెవెన్యూఅధికారుకు తెలియజేసి నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాముడిపెంట ప్రాంతంలోని తాళంవేసి ఉన్నఇంట్లో చోరీ జరిగినట్టు ఎస్‌ఐ రామచంద్రుడు శుక్రవారం తెలిపారు. పోలీసులు, బాధితుడు మైలారం అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన కుటుంబసభ్యులతో వారం రోజుల క్రితం హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం రాత్రి సమయంలో ఇంటికి తిరిగి రాగా తలుపులకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉంది. దీంతో అంజయ్య పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలానికి చేరుకోని పరిశీలించాడు. బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 50వేల రూపాయల నగదు అపహరణకు గురియినట్లు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపాడు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: పట్టణంలోని మున్నూరుకాపుసత్రం సమీపంలో తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుమార్ అనే ఇంటి యజమాని వేడుక నిమిత్తం గురువారం ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండగా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని దాదాపు తులం బంగారు ఆభరణాలతో పాటు 30 తులాల వెండి ఆభరణాలు చోరీఅయ్యాయని వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని కాకతీయ పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగిఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్నఇద్దరిలో యాకూబ్‌కు తీవ్రగాయాలు కాగా, ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనేవారిని108లో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్‌లో వ్యక్తి మృతి

వీణవంక, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి ఓదేలు(58) ఆర్టీసీ బస్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఓదెలు కరీంనగర్‌లో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజువారిగా శుక్రవారం సాయంత్రం ఆర్టీసీబస్‌లో రెడ్డిపల్లి నుంచి కరీంనగర్ వెళ్లాడు. బస్సు అల్లునూరు వద్దకు వెళ్లగానే పక్కకు పడిపోవడంతో గమనించిన తోటి ప్రయాణికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందిచడంతో అసుపత్రికి వెళ్లినట్టు తెలిపారు.

మహాలక్ష్మి

ఇబ్బందులు తొలగేనా?

● ఆర్టీసీలో పెరగని బస్సులు ● పెరిగిన మహిళల రద్దీ



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

బగత్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారినా, అందుకనుగుణంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత వచ్చే రెండవ మహిళా దినోత్సవం నుంచైనా మహిళల కోసం అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులు తొలగించాలని మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని అమలు చేసినా దానికనుగుణంగా బస్సు సర్వీసులు లేక మహిళామణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోలు ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, గోదావరిఖని, మంథని డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా తొమ్మిది వందలపైచిలుకు బస్సులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్సులను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రం తీసుకు వచ్చింది. ఎలక్ట్రిక్ బస్సులు పట్టణాలకే పరిమితమవడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కొరత ఉంది. కరీంనగర్ నుంచి రాయపట్నం, గోదావరిఖని, జగిత్యాల, హుజూరా బాద్ రూట్లలో మహిళల రద్దీ తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్- రాయ పట్నం రూట్‌లో మహాలక్ష్మి పథకానికంటే ముందే రద్దీ తీవ్రత ఎక్కువగా ఉండేది, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళల రద్దీ పెరగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మహిళలు ఉన్న చోట్ల ఆగని బస్సులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్టాండ్లలోనే బస్సులు నిండిపోతున్నాయి. ప్లాట్ ఫాంలపైకి రాక ముందే బస్సుల్లోకి ఎక్కేందుకు ప్రయాణికులు హైరానా పడుతున్నారు. ఉన్న కొద్ది పాటి బస్సులతోనే అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ దాటినతర్వాత బస్సులు ఎక్కాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరంలోని వివిధ బస్టాప్‌లలో మహిళలు ఎక్కువగా ఉంటే డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని అంటున్నారు. మహిలలను డ్రైవర్లు, కండక్టర్లు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకునైనా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచే ప్రకటన చేయాలని మహిళలు కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకునేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేయాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు ఆపడం లేదు: సాహితి, విద్యార్థిని



మహిళలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో బస్సులు ఆపడం లేదు. విద్యార్థులు దూరప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకునే విధంగా బస్సులు ఆపాలి. బస్సుల సంఖ్యను పెంచాలి.

బస్సుల సంఖ్యను పెంచాలి: కీర్తన, గృహిణి



పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపించాలి.



బస్సును తప్పించబోయి
డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సును తప్పించబోయి భారీలోడుతో వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో బస్సులోఉన్న ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్ గమనించకుండా ఇన్ గేట్ నుంచి బస్టాండ్‌లోకి బస్సును తీసుకుపోతున్నాడు. ఇదే సమయంలో మెట్‌పల్లి నుంచి జగిత్యాలవైపు వెళ్తున్న లారీడ్రైవర్ బస్సును తప్పించబోయాడు. దీంతో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. సంఘ టనలో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

దేవాలయాల్లో చోరీ

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణుకఎల్లమ్మ, పోచమ్మదేవాలయాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మొలంగూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్‌గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలకొట్టి ప్రవేశించారు. ఆలయంలోని హుండీల తాళాలను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి అని గౌడసంఘం నాయకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తాలోని మహాశివరాత్రి సందర్భంగా కట్టెలతో ఏర్పాటుచేసిన కమాన్‌లో శుక్రవారం రాత్రి బైక్ ఇరుక్కొని ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన ప్రశాంత్(32)కు తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాలతో కమాన్‌లో ఇరుకున్న యువకుడిని స్థానికులు బయటకు తీసి చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం తిప్పాపూర్ శివారులోరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఘటన స్థలానికిచేరుకొని ప్రమాదానికిగల కారణాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యేలకు రూ. ఐదు కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు

● నిధుల ఖర్చులో వేసవిలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి ● మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు... సంస్థాగతంగా బలోపేతం కావాలి ● ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గానికి స్పెషల్‌డెవలప్‌మెంట్‌ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద 5కోట్ల రూపాయలు ఇస్తున్నామని, గతంలో ఇచ్చిన 10కోట్లకు ఇవి అదనమని ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సంబంధించి పెండింగ్ అంశాలు, అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గతంలో ఎస్‌డీఎఫ్ 10 కోట్ల నిధుల్లో ఎంత వరకు పనులు జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఐదు కోట్ల నిధులను తాగునీటి సంబంధ అవసరాలకు మొదటి ప్రాధాన్యంతో ఖర్చుచేయాలని మంత్రులు సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, మరో మూడు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఈలోగా నియోజకవర్గాల్లో నీటి పారుదలకు సంబంధించిన పెండింగ్ పనులుంటే త్వరగా పూర్తి చేసేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ్యులు కలిసి కట్టుగా జిల్లా అభివృద్ధిపై దృష్టిని సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, సంజయ్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావు, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర సమాచార, ప్రసారభారతి అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామి వారిని శుక్రవారం కేంద్ర సమాచార శాఖ ప్రసారభారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసారభారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలు దర్శించుకునిప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాస్, టిసి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది ఉన్నారు.



ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువపత్రాల సృష్టి

● తండ్రితో పాటు సహకరించిన ముగ్గురి రిమాండ్ ● నిందితుల్లో విశ్రాంత తహసీల్దార్, డీఎంహెచ్‌వో ఉద్యోగి



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన తండ్రితోపాటు ఆయనకు సహకరించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితుల్లో కరీంనగర్ పట్టణానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్య, డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌లు ఉన్నారని చెప్పారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పశు వైద్యశాలలో లైవ్‌స్టాక్ అధికారిగా పని చేస్తున్న కరీంనగర్ పట్టణానికి చెందిన జడ కొమురయ్య కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని, అనారోగ్య కారణంగా ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆయన దరఖాస్తును పరిశీలించారు. దాంతో కొమురయ్య నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని ఎల్లారెడ్డిపేట పశు వైద్యాధికారి ఈ నెల 1న స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమాకాంత్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. జడ కొమురయ్య తాను అనారోగ్య కారణంగా ఉద్యోగవిరమణ పొంది కొడుకును తనస్థానంలో ఉద్యోగంలో పెట్టించాలని కరీంనగర్‌కు చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్యను సంప్రదించారు. అందుకు రూ.3లక్షలు ఇవ్వాలని బీరయ్య చెప్పడంతో కొమురయ్య అప్పగించారు. విశ్రాంత తహసీల్దార్ బీరయ్యకు డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌ను పరిచయం చేసి వివరాలు తెలిపారు. ఆయనకు తెలిసిన కరీంనగర్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశంను కలవాలని సూచించారు. రాజేశం వద్ద కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, స్టాంపులు, అందుబాటులోని లేని వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలను సృష్టించామని విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుంచి ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, 18 నకిలీ స్టాంపులు, కంప్యూటర్, మానిటర్, సీపీయూ, పవర్ కేబుల్, సిస్టం లింక్ కేబుల్‌ను స్వాధీనపర్చుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమాకాంత్ ఉన్నారు.

పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళ మృతి



ఉమ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళమృతిచెందిన సంఘటన మండలంలోని మెట్‌పల్లిగ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. ఈనెల6 గురువారం రోజున మెట్‌పల్లిలో బకారపు ప్రభాకర్ కుమార్తె నవ్య వివాహం మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన జినుక అశోక్‌తో జరిగింది. సాయంత్రం అప్పగింతలు అయిన తర్వాత కారు డ్రైవర్ కురుమ శ్రావణ్ ప్రభాకర్ ఇంటినుంచి నూతన వధూ వరులను, బంధువులను కారులో తీసుకొని ఊరేగింపు కార్యక్రమానికి బయలు దేరారు. ఊరేగింపులో భాగంగా నృత్యాలు చేస్తుండగా డ్రైవర్ శ్రావణ్‌కు ఫోన్ రావడంతో కారు దిగి పక్కకెళ్లి మట్లాడుతున్నాడు. ఈక్రమంలో పెళ్లి కుమారుడు అశోక్ కారును హఠాత్తుగా ముందుకు పోనిచ్చాడు. దీంతో కారు అక్కడ నృత్యాలు చేస్తున్న బకారపు ఉమ(35), కూతురు బకారపు నిఖితతోపాటు పలువురు పైకి దూసుకెళ్లింది. వెంటనే ఉమను భర్త పర్శరాములు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎంకు, అక్కడినుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా శుక్రవారం తెల్లవారు జామున మార్గమధ్యలో మృతిచెందింది. ఉమ కూతురు నిఖితకు కుడి భుజం, కాలు విరిగింది. మృతురాలి భర్త బకారపు పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన..

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని పెళ్లి ఊరేగింపులో గాయపడి మృతిచెందిన బకారపు ఉమ, గాయపడిన వారికి నష్టపరిహారం అందించి న్యాయంచేయాలని శుక్రవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎండుతున్న పంటలు.. రోడ్డెక్కిన రైతులు..

● సిద్దిపేట-కామారెడ్డి రహదారిపై బైఠాయింపు



గంభీరావుపేట పెద్ద కాలువ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గంభీరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట పెద్ద కాలువ ఆయకట్టు రైతులు రోడెక్కారు. పంటలు ఎండుతుండటంతో సిద్దిపేట- కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి, సాగునీరు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఎగువమానేరు నీటిని నమ్ముకుని పెద్ద కాలువ కింద 2000ఎకరాలకు పైగా పంటలు వేశామని, ఇప్పుడు పెద్ద కాలువలో చుక్కనీరు లేదని వాపోయారు. ఎగువ మానేరు నీటిని పెద్ద కాలువలోకి విడుదల చేస్తేనే పంటలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక తూం ఏర్పాటు చేస్తేనే పెద్ద కాలువ ఆయకట్టు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుందన్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆందోళన చేయడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేసే ప్రయత్నం చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆందోళన విరమించాలని పోలీసుల సూచనల మేరకు రైతులు శాంతించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, స్వామి, రాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





హక్కుల కోసం పోరాడాలి..

డాక్టర్ కె శ్రీవాణి, అర్థశాస్త్రం విభాగం అధిపతి, శాతవాహన విశ్వవిద్యాలయం

మహిళా హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళామణుల స్ఫూర్తిని స్మరించుకుంటు ముందుకు సాగాలి. మహిళా సాధికారత అనేది ఒక్క రోజులో సాధించలేము. ప్రతిరోజు మనం ఒక ముందడుగు వేస్తే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలం. మహిళా దినోత్సవం మహిళల హక్కుల కోసం పోరాడేందుకు, లింగ సమానత్వం సాధించేందుకు ఒక గొప్ప అవకాశం.



మహిళా సాధికారతను ప్రోత్సహించాలి..

మెట్టు విజయలక్ష్మి, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

ప్రజాసామ్యంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రజాసామ్య వ్యవస్థ సమాన హక్కులు, అవకాశాలను అందించే సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. మహిళల హక్కులు, స్వేచ్ఛ, రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వంలాంటి వాటిని ప్రోత్సహించాలి. పురుషులతో సమాన హక్కులను మహిళలకు కల్పించడంతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించాలి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం ప్రజాస్వామ్య వ్యవస్థలో కల్పించాలి. మహిళలపై వివక్ష, లింగ అసమానతలు, హింస వంటి సమస్యలను ఎదుర్కోవడానికి చట్టాలు, విధానాలను రూపొందించాలి.



అసమానతలు తొలగాలి..

డాక్టర్ స్రవంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇప్పటికీ మహిళలపై అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. అసమానతలు తొలగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి..

మిట్టగడుపల సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల



మహిళలు చేయలేని పనులు లేవు. అన్ని పనులను ఎలాంటి కష్టం లేకుండానే చేసుకుంటూ పోతుంటారు. మహిళలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే తప్ప ఎక్కడా అమలు చేయడంలేదు. కనీసం గుర్తించడం కూడా లేదు. నిరంతరం ఎలాంటి అలసట లేకుండా కష్టపడుతున్న మహిళలకు సమాజంలోని అన్నిరంగాల్లో ప్రాధాన్యమివ్వాలి. ఆదరించి గుర్తింపునివ్వాలి.

సమాన హక్కులు కల్పించాలి..

ఎంఏ భారతి, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ, సిరిసిల్ల



సమాజంలో మహిళలకు పురుషులతో సమాన హక్కులను కల్పించడంతో పాటు స్వేచ్ఛను ఇవ్వాలి. కుటుంబాల్లో మహిళలను పురుషులతో సమానంగా చూడాలి. చదువు నేర్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలోనే కాకుండా ప్రతి విషయంలో కూడా ఆడ,మగ సమానం అనే ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరూ ఉండాలి. మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకెళ్లాలి. ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

ఆకాశంలో సగం



ప్రపంచానికి మార్గదర్శకంగా మహిళా శక్తి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. 2025 మహిళా దినోత్సవాన్ని 'ప్రతి మహిళకూ, ప్రతి బాలికకూ హక్కులు, సమానత్వం, సాధికారత' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశం. 1975 మార్చి 8న ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది.

-గణేశ్‌నగర్, కరీంనగర్ టౌన్, కరీంనగర్ కల్చరల్, జగిత్యాల, సిరిసిల్ల

కరీంనగర్ సమీపంలోని ఎల్‌ఎండీలో తెప్ప నడుపుతున్న యువతి

స్వతంత్రంగా జీవించాలి..

ప్రొఫెసర్ డి వరలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్



మహిళలు స్వతంత్రంగా జీవించాలి. నిరంతర నైపుణ్యాలు మెరుగుపరచడం, వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ప్రయత్నించాలి. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

అన్ని రంగాల్లో రాణించాలి

బీఎస్ లత, అదనపు కలెక్టర్, జగిత్యాల



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయం, వ్యాపారం ఇలా పలురంగాల్లో మహిళలు కీలకపాత్రను పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వంటింటికి మహిళలు పరిమితం కాదని, అవసరమైన ఏబాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తారని చాటాలి. గొప్పగొప్ప మహిళల నేపథ్యాలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి.

వెనుకబాటుతనం పోవాలి..

సత్యమ్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జగిత్యాల



మహిళల్లో వెనుకబాటుతనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనోధైర్యం పెంచాలి. అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రోత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకువచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి

సీహెచ్ నిరోష, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మానకొండూర్



మహిళలు పని ప్రదేశంలో ఇంకా మహిళలు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి. అన్ని రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారు. ఇది గొప్ప విషయం. మహిళలు తలచుకుంటే కానిదేమీ ఉండదు. ధైర్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఓ మహిళా అధికారిగా ఆనందంగా ఉంది.

మహిళలు తమ శక్తిని చాటుకోవాలి

సీహెచ్ సోఫియా, జిల్లా కోశాధికారి, జగిత్యాల



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతీ ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళ ఉద్యోగులను గౌరవించాలి.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డాక్టర్ సుజాత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కరీంనగర్

మహిళలు ఆర్థిక స్వతంత్రత సాధించాలి. అది విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. విద్య ద్వారా మానసికోల్లాసం కూడా లభిస్తుంది. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడం ద్వారా పేదరికంతోపాటు ఆధారపడడమనే చక్రాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు.





మహిళల హక్కులపై అవగాహన కల్పించాలి

డాక్టర్ పొలాస మాధవి, ప్రొఫెసర్, చల్మెడ మెడికల్ కాలేజీ.

మహిళల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయస్సులో పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో లింగ వివక్ష లేకుండా చూడాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.సబిత, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చాలా మంది ఉపాధిపొందుతున్నారు. వ్యాపార రంగంలోనూ రాణించాలి ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే విశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలి.





మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్, జవహర్ బాలభవన్

అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతీ మహిళా ఎవరినో ఒకరిని స్ఫూర్తిగా తీసుకోవాలి. నాకు స్ఫూర్తి ఎంఎస్ సుబ్బులక్ష్మి. అందుకే సంగీతం నేర్చుకున్నా.. నేర్పుతున్నా. కొన్నేళ్లుగా బాలభవన్ సూపరింటెం డెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా.

దిక్సూచిగా నిలవాలి

సుజాత, డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి, జగిత్యాల

ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండే వారు. ఈరోజు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినప్పుడే మహిళా లోకం ఆర్థికంగా ఎదుగుతారు. సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలవాలి.



మహిళా సాధికారత సాధించాలి

ఎ.సరిత, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కరీంనగర్



మహిళలు అన్ని అంశాల్లో సాధికారత సాధించాలి. గ్రంథాలయంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల పఠన కోసం సంస్థ చైర్మన్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. మహిళల రక్షణ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సేవలపై అవగాహన పెంచుకోవాలి.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, కరీంనగర్ నగర పాలక సంస్థ



మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అది నిబద్ధతతో పూర్తి చేస్తారు. ఏ పనిలోనైనా నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటూ అన్ని రంగాల్లో రాణిస్తారు. చదువులో ముందుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే సమాజం గౌరవిస్తుంది. సమాజంలో గౌరవం పొందేందుకు ప్రతి మహిళా పట్టుదలతో ముందుకెళ్లాలి.



కలిసికట్టుగా స్వయం ఉపాధి వైపు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష

- చిల్లపల్లి గ్రామానికి జాతీయ పురస్కారం
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- ప్రోత్సాహకంగా రూ. 75 లక్షలు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిల్లపల్లి సక్సెస్ స్టోరీ

మంథని/మంథనిరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారంతో మంథని మండలంలోని చిల్లపల్లి మహిళలు స్వయం ఉపాధి పొందుతూ వివిధ రకాల వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. తమ చదువును, పొందిన వృత్తి నైపుణ్యాన్ని ఉపాధి వైపు మళ్లించి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా స్వయం సమృద్ధిలో దూసుకెళ్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు గ్రామంలో శ్రీజ్యోతి మహిళా గ్రామైక్య సంఘంలోని 33 సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 335 మంది చేయిచేయి కలిపారు. అయితే డబ్బును పొదుపు చేయడమే కాదు కాలానికి అనుగుణంగా పురుషులతో సమానంగా పోటీ పడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రణాళికలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్వయంగా ఉపాధి వైపు అడుగులు వేసి విజయవంతమయ్యారు. తమ డబ్బును సంఘాలలో జమ చేసుకుంటూ, అందులో నుంచే రూపాయి వడ్డీకి రుణం తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వీరంతా కిరాణ షాపులు, కుట్టు మిషన్లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్ హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్స్, టిఫిన్ సెంటర్లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండి గిర్నీ, కూరగాయల సాగు, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం తదితర పనులతో మహిళలు స్వయం ఉపాధితోపాటు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తమ సంఘాల్లో రూపాయి వడ్డీకి రుణం తీసుకుని ఉపాధి పొందుతూ వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా గుర్తించింది.

దేశ వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల్లో గ్రామంలో 9 అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు ప్రకటించగా ఇందులో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో చిల్లపల్లి పంచాయతీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. 2024 డిసెంబర్ 11న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష పురస్కారం అందుకున్నారు. పురస్కారం తోపాటు రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహాన్ని గ్రామానికి దక్కేలా చిల్లపల్లి గ్రామ మహిళలు తమ శక్తిని చాటారు.





గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

పని చేసుకుంటూనే టైలరింగ్‌లో శిక్షణనిస్తున్నా

రామిళ్ళ మల్లేశ్వరి, చిల్లపల్లి.



భర్త వ్యవసాయం చేస్తుండగా నేను కుట్టు పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నా. అలాగే గ్రామంలోని చాలా మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నా.. ఇప్పటి వరకు 40 మంది మహిళకు పైగా శిక్షణ ఇచ్చాను. జ్ఞానోదయ పొదుపు సంఘంలో రెండేళ్ల కిందట రూ.లక్ష రుణం తీసుకొని కుట్టు యంత్రాలు కొనుగోలు చేశాను. కుట్టు పని, శిక్షణ తోపాటు చీరలు, దుస్తులు అమ్ముతున్నా. వీటి ద్వారా ఆదాయం పొందుతున్నాను.

మహిళల కృషితోనే జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు

ఆరె సౌజన్య, సీఏ, చిల్లపల్లి.



శ్రీజ్యోతి గ్రామైక్య సంఘంలో సభ్యులందరితో నెలకు రెండు సార్లు మీటింగ్ పెట్టుకుంటాం. ఇందులో ఆర్థిక లావాదేవీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తాం. సంఘంలోని సభ్యులందరు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవటానికి లోన్లు తీసుకొని తిరిగి వడ్డీతో కలిసి చెల్లిస్తుండటంతో ఇతర సభ్యులకు రుణాలు సకాలంలో ఇవ్వటానికి వీలుకల్గుతుంది. సంఘ సభ్యుల స్వయం ఉపాధితో గ్రామంలో వారి కుటుంబాలు అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నాయి. వీరి ఆర్థిక క్రమశిక్షణ, స్వావలంబన, స్వయం ఉపాధి జాతీయ స్థాయిలో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం సంతోషంగా ఉంది.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాలను విశ్వబ్రాహ్మణ సంఘం మహిళలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల వద్ద నుంచి బోనాలను బ్రహ్మంగారి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం నెత్తిన పెట్టుకొని, డప్పుచప్పుళ్లతో పోచమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ప్రతీ సంవత్సరం బ్రహ్మంగారి కల్యాణానికి ఒక రోజు ముందుగా విశ్వబ్రాహ్మణులు పోచమ్మ బోనాల పండగను నిర్వహించడం ఆనవాయతీ. శనివారం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మంగారి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

- కొడిమ్యాల (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని పంచాయతీ శాఖలో పనిచేయుచున్న పలువురు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సీనియారిటీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో సీఈవో గౌతమ్‌రెడ్డిని పలువురు ఉద్యోగులు కలిసి సమస్యను విన్నవించారు. పంచాయతీ శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు సీనియారిటీ జాబితాలో కొత్తగా వచ్చిన వీఆర్వో, వీఆర్ఏలను చేర్చడం వల్ల సీనియర్‌గా ఉన్న ఉద్యోగులు నష్టపోతున్నారని వాపోయారు. సీనియారిటీ జాబితా సవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



జడ్పీ సీఈవో గౌతంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

జగిత్యాల (ఆంధ్రజ్యోతి)

ఒక్క పూట పని సౌకర్యం కల్పించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ సిబ్బంది

గ్రామ పంచాయితీ సిబ్బందికి వేసవి నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఒక్క పూట పని సౌకర్యం కల్పించాలని మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బంది ఎంపీడీవో స్వాతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సబ్‌ట్రెజరీలలో నిలిచపోయిన బకాయి వేతనాలు విడుదలచేయాలని, పంచాయతీ బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని వినతి పత్రంలో కోరారు. ప్రతినెలా గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కోరెపు మల్లేశం, మ్యాక దేవమ్మ, గసిగంటి శ్రీను, మల్లేశం, మహేశ్, ఉప్పరి రవి, నర్సమ్మ, దప్పు రవి, నర్సయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్యాల (ఆంధ్రజ్యోతి):

వైభవంగా కుంకుమ పూజలు

మెట్‌పల్లి పట్టణంలోని పోలెరమ్మ ఆలయంలో శుక్రవారం విశ్వబ్రహ్మణ మహిళ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రామకృష్ణచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకలు నిర్వహించారు. మహిళలచే కుంకుమ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మహిళలు వంగల రమ్య, కోటగిరి లావణ్య, గాలిపెల్లి దివ్యవాణి, ఉప్పుల రూప, లత, వైష్ణవి, రజిత తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి)

సంక్షిప్త సమాచారం

జగిత్యాల అర్బన్: వాటర్ స్పోర్ట్ అకాడమీ బోయిన్‌పెల్లి, మరియు స్పోర్ట్స్ పాఠశాల జాతర్ల బాలుర (అదిలాబాద్) కిన్నెరసాని(కొత్తగూడెం)ఉట్నూరు బాలికల (అదిలాబాద్) కాచనపల్లి బాలికల (కొత్తగూడెం జిల్లా) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జగిత్యాల జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జిల్లాలోని గిరిజన బాలబాలికలు తమ దరఖాస్తులను కరీంనగర్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని, విద్యార్థుల వయస్సు 31-08-2025 నాటికి 9 నుంచి 11 సంవత్సరాల లోపు ఉండాలని, ఎంపిక దేహదారుఢ్య పరీక్షల ద్వారా చేస్తారని తెలిపారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఐదు సూత్రాలతో కూడిన విజయిభవ పత్రికలను ఎంఈవో నాగభూషణం అందించారు.

జగిత్యాల అర్బన్: జగిత్యాల పట్టణానికి చెందిన కుంగ్‌ఫూ మాస్టర్ వెంకటేశ్వర్లును జిల్లా కోర్టు సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, జగిత్యాల జిల్లా కోర్టు కానిస్టేబుళ్లు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నరసింహ స్వామి వారి నూతన కళ్యాణ వేదిక స్థలం వద్ద స్థానిక వేదపండితులు శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు.

మెట్‌పల్లిటౌన్: బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణ (దాము) జయంతి సందర్భంగా దాము స్వగృహంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రఘు ఆయన చిత్రపటానికి పూలమలాలు వేసి నివాళులు అర్పించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన కుప్పను టాస్క్ ఫోర్స్ టీమ్ గుర్తించారు. సుమార్ 10 ట్రాక్టర్ల ట్రిపుల ఇసుక ఉంటుందని, వాటిని సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారి ఆర్ఐ ఉమేష్ తెలిపారు.

- పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తూ బోనస్ అందజేయాలని ఈనెల 11న మెట్‌పల్లి పట్టణంలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతువేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మకూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి మహాధర్నాలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు.

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలిక, బాలుర కళాశాలను మెట్‌పల్లి డీఎస్పీ ఎ రాములు పరిశీలించారు.

కోరుట్ల రూరల్: కోతులు, కుక్కల బారినుంచి మండలంలోని మోహన్‌రావుపేట గ్రామస్థులను కాపాడాలని మాజీ ఉపసర్పంచ్ గుండవేని రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు.

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చే మార్పులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రమోద్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆధ్వర్యంలో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల మానవుల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలను నివారించడానికి జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు.

- జిల్లాలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు ఉపశమనం కలిగించేలా ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చర్యలు తీసుకోవడం సంతోషకరమని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ)- 475 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతి రెడ్డి, అత్తినేని శ్రీనివాస్ అన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జనరిక్ మందులపై వైద్యురాలు రాణిరెడ్డి అవగాహన కల్పించారు.

గొల్లపల్లి: గొల్లపల్లి పట్టణ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సీనీయర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ ముస్కు లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా నల్ల నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కళ్లెం రవీంధర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా గంగారెడ్డి, కోశాధికారిగా శ్యామ్ సుందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కొడిమ్యాల: మండలంలోని సంద్రల్లపల్లి కేజీబీవీ పాఠశాలలోని 30 మంది పదో తరగతి విద్యార్థులకు మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పరీక్ష ప్యాడ్లు, 100 పెన్నులను పంపిణీ చేశారు.

- కొడిమ్యాల పట్టణానికి చెందిన చొక్కాల సాయికుమార్ ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం 10 వేల రూపాయలను సమకూర్చగా మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి ఆయనకు అందించారు.

కొడిమ్యాల: మండలంలోని రాంసాగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్‌లో భాగంగా మండలంలోని తిర్మాలాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను శిక్షించాలి



నినాదాలు చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

సారంగాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియాఅంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క విజయ్‌కుమార్ పోలీసు ఉన్నత అధకారులను, ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని నగునూర్ గ్రామంలో కొందరు దుండగులు అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించడంతో దళిత, బహుజన, మేధావి వర్గం గ్రామాన్ని సందర్శించారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుండగులు ఎంతటి వారైన శిక్షించాలని లేని పక్షంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బిరుదుల లక్ష్మణ్, జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్, న్యాయవాదులు నకుమల్ల లక్ష్మీనారాయణ, బొల్లె రాజన్న, గుడి కందుల మహేష్, మండల అంబేద్కర్ సంఘం నాయకులు పూడూరి శోభన్, గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● అనుమానితుల అరెస్ట్..

అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన సంఘటనలో పోలీసులు అనుమానితులను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్సై దత్తాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమాజాన్ని అవమానించడమే..

అంబేద్కర్‌ను అవమానించడం అంటే యావత్ సమాజాన్ని అవమానిండమేనని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. సారంగాపూర్ మండలంలోని నాగునూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి కొందరు దుండగులు చెప్పుల దండ వేయడాన్ని తీవ్రంగా ఖండించి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సాగి సత్యంరావు, నాయకులు అనంతుల గంగారెడ్డి, శంకర్, బద్ది గంగాధర్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ శివారులో మళ్లీ పెద్దపులి కలకలం

- ఆందోళనలో గ్రామస్థులు

కొడిమ్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో మళ్లీ పెద్దపులి కదలికలు ఉన్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కొడిమ్యాల మండలం నల్లగొండ-రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామ శివారులో ఒక గేదెను పెద్దపులి దాడి చేసి తిన్నదన్న వదంతులు వినిపించాయి. గేదెపై దాడిచేసింది పులి కాదని చిరుతపులి అని కొందరు భావిస్తున్నారు. గేదెపై దాడి చేసింది పెద్దపులా, చిరుతపులా అని అధికారులు నిర్ధారించాల్సి ఉంది. మండలంలోని కొండాపూర్, నల్లగొండ, తిప్పయ్యపల్లి, దమ్మయ్యపేటతో పాటుగా మండలంలోని అటవీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి అటవీ అధికారి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గేదెపై దాడి చేసింది చిరుతపులి అని తెలిపారు. గత జనవరి 24న మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపింది. రెండోరోజు ఆవుపై దాడి చేసింది పెద్దపులి అని కొడిమ్యాల అటవీ రేంజర్ గులాం మొయినుద్దీన్, అటవీ అధికారులు అప్పట్లో ధ్రువీకరించారు. కొడిమ్యాల మండలంలో మళ్లీ పెద్దపులి కదలికలు ఉన్నాయని వదంతులు రావటంతో కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, కొడిమ్యాల, మల్యాల మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలు రాత్రి పూట బయటకు వెళ్లవద్దని, పొలం పనులకు ఒంటరిగా వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. గొర్రెల, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయమై కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పెద్దపులి కొడిమ్యాల మండలంలో సంచరిస్తున్నట్లు తాము బావిస్తున్నామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎస్సారెస్పీ నీటితో చెరువులను నింపాలి

జగిత్యాల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎండిన చెరువులను ఎస్సారెసీ నీటితో నింపి ప్రభుత్వం పంటలను కాపాడాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని వంజేరుపల్లి గ్రామంలో నీరులేక ఎండిన చెరువును స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు కమలాకర్ రావు, రవి, రాజు, తిరుపతి, మహేష్, గంగారెడ్డి పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో నాలుగు నెలల జైలు

జగిత్యాల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి నాలుగు నెలల జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన అల్లకొండ రవికి జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన తారతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ రవి తన భార్య తారను తరచుగా వేధించాడు. పెద్దమనుషుల సమక్షంలో పలు పంచాయితీలు సైతం జరిగాయి. అయినప్పటికీ రవి మరోసారి తన భార్యను వేధించడంతోపాటు 2019 మే 25న దాడికి పాల్పడ్డాడు. దీంతో భాధితురాలు అదే రోజు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సాక్ష్యులను జగిత్యాల కోర్టులో శుక్రవారం ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా ఆర్టీసీ బస్సును నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండలం సుద్దపెల్లి గ్రామానికి చెందిన శేరు అంజయ్య తన ద్విచక్ర వాహనంపై కుటుంబసభ్యులతో కలిసి జగిత్యాల నుంచి సుద్దపెల్లికి 2019 మార్చి 1న వెళుతున్నాడు. ఈక్రమంలో జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ పయాజ్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ అంజయ్య ద్విచక్రవాహనాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపెల్లి బైపాస్ రోడ్‌లో ఎదురుగా ఢీకొట్టాడు. అంజయ్యతో పాటు తన భార్య, కూతురుకు తీవ్రగాయాలయ్యాయి, బాధిత కుటుంబ సభ్యులు అదేరోజు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సాక్ష్యులను జగిత్యాల కోర్టులో శుక్రవారం ప్రవేశ పెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని తన వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

దూకుడు పెంచిన ఏసీబీ

(3వ పేజీ తరువాయి)

ద్రావణం ఉండే సీసాలను ఎదుట ఉంచుతారు. ఏసీబీ అధికారులు బాధితులకు ముందుగానే కరెన్సీ నోట్లు ఇచ్చి వాటిని ఉద్యోగులకు లంచంగా ఇవ్వమంటారు. ఈ క్రమంలో ఏసీబీ వారు ఆ కరెన్సీ నోట్లకు ముందుగా ఫినాల్‌ఫ్తలీన్ అనే పౌడర్‌ను రాస్తారు. ఆ పౌడర్ మన కళ్లకు కనిపించదు. ఈక్రమంలో బాధితులు ఆ నోట్లను ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వగానే ఏసీబీ వారు దాడిచేసి ఆ ఉద్యోగులను అదుపులోకి తీసుకుంటారు. అనంతరం వారి వద్ద ఉండే లంచం ఇచ్చిన కరెన్సీని స్వాధీనం చేసుకుంటారు. తర్వాత ప్రభుత్వ అధికారుల చేతులను సోడియం బైకార్బోనేట్ మిశ్రమంలో ముంచుతారు. ద్రావణం పింక్ రంగులోకి మారుతుంది. అలా వారు లంచం తీసుకున్నారని చెప్పేందుకు పింక్ రంగులోకి మారిన ఆ మిశ్రమమే సాక్ష్యమని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

- మార్చి 6వ తేదీన ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేశ్ వద్ద వేతనం చెల్లింపు కోసం రూ. 20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈనెల 5వ తేదీన జిల్లాలోని కోరుట్ల ఎస్ఐ శంకరయ్య ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. కోరుట్ల మండలం జోగినిపల్లి శివారులో మామిడితోటలో పేకాట ఆడుతూ ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ. 23 వేల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ శంకరయ్య సెల్ ఫోన్ రిలీజ్ చేయడానికి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈ యేడాది జనవరి 15వ తేదీన మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ల్యాండ్ మార్ట్‌గేజ్ చేసేందుకు మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ తిఆసిఫోద్దిన్, డాక్యుమెంట్ రైటర్ రవి, ఆఫీస్ సబార్డినేట్ రవి కలిసి ఐదువేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈ యేడాది ఫిబ్రవరి 7వ తేదీన హన్మకొండలో పనిచేస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పుప్పాల శ్రీనివాస్‌కు చెందిన జగిత్యాలలోని గృహంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదు మేరకు జగిత్యాలలో ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.
- 2024 డిసెంబరు 16వ తేదీన మామిడి కర్రను తరలించడానికి అనుమతి కోసం 4,500 రూపాయలు లంచం తీసుకుంటూ జగిత్యాల డీఆర్‌వో హఫీజోద్దిన్ పట్టుబడ్డారు.
- 2024 ఏప్రిల్ 29వ తేదీన బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మనోహర్ ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు.
- 2024 జూన్ 21వ తేదీన రాయికల్ ఎస్ఐ అజయ్ మరొకరు పుల్లూరి రాజు రూ. 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కారు.

50 గ్రాములు గంజాయి స్వాధీనం

బుగ్గారం మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దునూరు గ్రామ శివారులో పల్లె ప్రకృతి వనం వద్ద శుక్రవారం గంజాయి పట్టుకున్నట్లు బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. తన సిబ్బందితో జరిపిన తనిఖీలో ఒక ద్విచక్రవాహనంపై 50 గ్రాముల గంజాయి తీసుకొని వస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. న్నారు. గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందించాలని ఆయన కోరారు. గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా, సరఫరా చేసినా, వారికి సహకరించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ధర్మపురి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం ఉదయం లభ్యమైనట్టు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వరకు వయస్సు కలిగి ఉంటాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి శరీరం పూర్తిగా ఉబ్బి ఉందని, ఆచూకీ తెలిసిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన అన్నారు. మృతుడి వివరాల తెలిసిన వారు ఉంటే 8712656824 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మెట్‌పల్లి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళాల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని జాగృతి మండల సమాఖ్య సభ్యుల అభిప్రాయాలను, ప్రభుత్వ పథకాలతో కలిగే ఆర్థిక ప్రయోజనాలను చిత్రీకరణ కార్యక్రమాన్ని సీఎం కార్యాలయం వచ్చిన బృందం చేపట్టారు. అనంతరం మహిళలు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఎలాల రమ, పులి జ్యోతి, కసాడి సోని, ఏపీఎం విమోచన, సీసీలు పాల్గొన్నారు.

అరుణోదయ మండల సమాఖ్యకు ఆర్టీసీ బస్సు కేటాయింపు

కథలాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అరుణోదయ మండల సమాఖ్యను ప్రభుత్వం ఆర్టీసి బస్సు కేటాయించినట్టు సెర్ప్ ఏపీఎం నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. సీఏఎఫ్ గ్రాంటు కింద ప్రభుత్వం రు. 30 లక్షలు అందిస్తుండగా మండల సమాఖ్య నుంచి రు. 3 నుంచి 6 లక్షల మేర చెల్లింపు చేయాల్సి ఉంటుందన్నారు. బస్సును ఆర్టీసి అద్దెకు తీసుకుని నెలకు సమాఖ్యకు ఖర్చులు పోను ప్రతీ నెలా రు. 77 వేలు అద్దె జమచేస్తుందని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్సు అందజేస్తారని తెలిపారు.

ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం







మల్యాలలో ఉపాధి కూలీలకు సన్మానం చేస్తున్న అధికారులు, బుగ్గారం మండలంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం, పాషిగామలో విద్యార్థుల తల్లులను సన్మానిస్తున్న హెచ్‌ఎం సంపత్‌కుమార్

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

రాయికల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపెల్లి ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు ఏలేటి ప్రణీత, సరిత, నవితలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచర్ల శ్రీనివాస్, అంకారావు, నరేష్, మధు, తపస్ జిల్లా బాధ్యులు మహేశ్వర్ శర్మ, ఏఏపీసీ చైర్మన్ వనిత తదితరులు పాల్గొన్నారు. రాయికల్ పట్టణంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు జిల్లాల లావణ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి స్వప్న, కోశాధికారి అయిత మాధవి పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న మహిళా కూలీలతో కలిసి అధికారులు కేక్ కట్ చేశారు. ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, శ్రీకాంత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో మండలంలోని సెర్ప్ వీవోఏలకు, సీసీలకు బ్యాంక్ మేనెజర్ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామంలోని మార్గదర్శి కాన్వెంట్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని పాషిగామ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు. పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు సునీతను హెచ్ఎం తులసి ఆగమయ్య సన్మానించారు.

బుగ్గారం: మండలంలో జరిగిన వేడుకల్లో తపస్ రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు, సతీష్, ప్రసాద్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు కొలిచాల సత్యరాజు, తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్, పంగ కిరణ్ కుమార్, బోయిన చంద్రశేఖర్, బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు కేశవేణి మౌనిక, తాటి రమాదేవి, బోగ నాగరాని, ఎం రమాదేవి, బి.స్వరూప, బి లలిత, బి మౌనిక పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కథలాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో శుక్రవారం గుగ్గిళ్ళ గంగు (75) అనే వృద్ధురాలు అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గంగుకు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఇంట్లో ఎవరూలేని సమయంలో మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన గంగు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమీపంలోని వరద కాలువ వద్ద గంగు చెప్పులు, కట్టె, కనిపించినట్లు కుటుం బీకులు పేర్కొన్నారు.

దేవాలయాల హుండీ లెక్కింపు

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమొగిళి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించినట్లు ఈవో విక్రం తెలిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం 55,039 రూపాయలు, ఆంజనేయస్వామి ఆలయ హుండీఆదాయం 1,72,090 రూపాయలు సమకూరినట్లు అధికారులు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫిబ్రవరి 27న ఆశా వర్కర్‌పై అత్యాచారం జరగగా నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం మేరకు నిందితుడు మక్కల రాజుపై శుక్రవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.